క్రొత్తపల్లి సూర్యారావు గారు

(వెనుకటిసంచిక తరువాయి)

పండ్రెండవయంకురము

నెలపుట్టుదాకఁ జేతిలో డబ్బుపెట్టుకొని కొంచెమో యెచ్చో ఖర్చుపెట్టుకుంటె సుఖము ననుభవించుట జీతము పెరుఁగుటవలన–ప్రేమమున వర్తనలవలన–నెలనెలకు డబ్బు పెట్టి మంచిబియ్యము వర్తకులయొద్దనే కొనుట యన్నింటిలో సుఖకరమైనది. మామగారికిఁ బ్రతిమాసమును ధారాళముగాఁ బదిరూపాయలు పంపుట రెండవ సౌఖ్యము. కట్టుకొనుటకు బట్టలు దొరకుచున్నవి. రెండు మూఁడు లలలోఁ గొంత కూడఁబెట్టుకొని యొక్క–చీర, యొక్క–చాపు – ఈపనులు ధాటిగా జరిగిపోవుచున్నవి. ఇక్కడఁ జాలకాల ముంటిమి. దైవ మిచ్చినది చాలునను తృప్తియొక్కటియే మాకుఁ దోఁచు. ఇట్లుండఁగా గోపిగారు మాకొక్కయుత్తరము వ్రాసినాఁడు. ఆగరపారా ప్రేమనుండి వచ్చినది.

ఉత్తరము—"గోపికృష్ణుఁడు రాంరాం. మీ మేలును గోరి నేను దైవముపై భారము వేసి భావికాలమును నమ్మికొని నాలుగణాలు నా జేబులోనుండి వ్యయము చేసితిని. కాఁబట్టి యీయుత్తరమునకైన వ్యయము టపాలబిళ్ల యర్ధణాయును, నేను మీకొఱకు సెలవుచేసిన నాలుగణాలును గలిపి పంపవలసినది. ఇంతే రాంరాం" అని.

ఉత్తరమున కర్ధణా, అవి నాలుగణాలు, నివి పంపుటకర్ధణా. అయిదణా లెవ్వరు తిన్నట్లురా, పాపము, బీదవాఁడు చేతిడబ్బు వ్యయపఱచి యేమి ప్రార్థనలు చేసినాఁడో! అని మాకు సంతోషమును, విచారమును–జీతము వచ్చిన తత్క్షణమే బియ్యమునకు, నుప్పు పప్పులకు నొక పొట్లము–చాకలి, మంగలి, బిచ్చగాండ్రు వీండ్రకు వేఱు పొట్లము–పండుగలలో వ్యయముల కొక్క–పొట్లము–ఇట్లు వేర్వేఱు పొట్లములు కట్టుకొని పెట్టెలోఁ బడవైచుకొని, నిత్యకృత్యమునకుఁ, గూరగాయలు నేతిమజ్జిగల కని కొంత చేతఁ బట్టుకొని, నెలచివరకు వచ్చునప్పటికి టకీమని పోసిన సరుకునకు, వేసినవత్తికి సరిపుచ్చుచున్నారము. ఒక్కప్పుడు మామగారికిఁ బంపు సొమ్మునకు మణియార్డరు కమీషనుకుఁ జాలకుండఁ బోవునది అప్పుడా మొత్తములోనుండియే పెట్టువారము. మే మొకరియొద్ద నప్పులు చేయలేదు; మరియొకరి కప్పియలేదు. చేబదుళ్లు మేము తెచ్చికొనలేదు; చేబప్పు లొకరి కీయనులేదు. ఎవ్వరైన నడిగిన లేదనలేము – వారిచ్చుట. కొన్ని నాళ్లుపట్టునో – బదుళ్లిచ్చుటకు డబ్బేది–అంతగాఁ దప్పనిసరి వచ్చినపుడు పండుగ. పొట్లములోనుండి యిచ్చి – మరల నిచ్చిరా యిచ్చిరి, నష్టద్రవ్యలాభము క్రింద గణన–వారీయకుండిరా యేదో పండుగనాఁడు పప్పులువండు కొన్నామని సమాధానపఱచుకొనుట – అంతియకాని ఆనెలలోఁ బండుగ

కని మఱికొంత వ్యయముచేసితిమా చాలదు నెలచివర చూచుటకు. ఇచ్చి వారివెంటఁ దిరుగుపద్ధతి లేదు. ఇట్టితరుణములో గోపీమర్దన్ గాఁడు మా ప్రాణములకు యమదూతవలె – నక్షత్రకునివలెఁ గనఁబడినాఁడు. నిత్యము బండిలో గార్డులచేత, పోష్టుబండ్లలోని సేవకులచేత వార్తలు పంపువాఁడు. పాపము వానికిమాత్రము డబ్బెక్కడిది? చిన్న జీతము, కుంపెరటివలె నింటినిండ బిడ్డలు. దైవముపై భారము వేసి మాకొఱకేల వ్యయము చేయవలయును? తనయదృష్టమునకై యా నాలుగణాలు సెలవుచేసికొనరాదా! వెఱ్ఱివాఁడు. మేము వసలిపోయినను మఱుమ్మీ వీఁడు వసలఁ డేయని మాకది విచారమో సంతోషమో చెప్పఁజాలము. పదినాళ్లు గడవనిచ్చి, వెఱ్ఱిముండకొడుకు, ఎక్కువ వ్యయముచేయించు నీగోపిగాఁడు మాపాటికి వీఁడెక్కడ వచ్చినాఁడురా యని తిట్టుచునే నాలుగణాలును, గార్డుచేతఁ బంపినాను. పంపునపుడుమాత్రము, 'మేము తప్పుకొని వచ్చినతర్వాత నీచేతడబ్బు కిలకిలలాడుచున్నదికాఁబోలు. ఏమిని శేషములు; మాకేమైన నప్పుపెట్టినవా' యని వేగా కోశముగా మాటలు చెప్పికూడఁ బంపితిమి. మీరున్నపుడే నయము. మాకిపుడు శుద్ధశూన్యముగా నున్నది. కాఁబట్టి దైవభక్తి ప్రార్థనలు, అదృష్టమునమ్మట యెక్కుడైనవని బొగ్గులపనివానిచేత వాఁడు ప్రత్యుత్తరము పంపినాఁడు. ఆపట్టుకొని వెళ్లినగార్డు పోఁగానే యిచ్చినాఁడా; నాచేతి కిచ్చినారని చెప్పుచునే వానిని ముప్పతిప్పలఁ బెట్టి మూఁడుచెఱువుల నీళ్లు త్రాగించి యెపుడో యేడ్పించి యిచ్చినాఁడట–మాబరువు తీఱిపోయినది.

మే మిరువురము, లచ్చి, గౌరి, వారినగలు–ఏదో ప్రసంగము చేసికొనుచుఁ గాలక్షేపము చేయుచున్నామనుకొనుఁడు. బంగాళీలు, ఓఢ్రులు నన్నుఁ గాంచి తమరీతిగా నన్నుఁగూడ నగలు చేయించుకొమ్మనువారు. ఈ రెంకుజతలేనా కాకి–అనను రెండుపుంజీళ్లయిన నుండవలదా యనువారు. ఉన్నవి; క్రొత్త-కోటని ధరింపనని, ఇప్పుడు డబ్బుచాలదని వినోదముగా ననుచుండుదానను. కోడిగ్రుడ్డంత బంగారము లేనివారుందురా యనుచున్ను, వారు నన్ను వారియంతో మనసుఁ దగినట్లు తలఁచుచుండువారు. ఒకరికష్టసుఖము లొకరి కెట్లు తెలియఁగలవు? నాచేమంతిపువ్వులు, నాగరము, కేతకి, ముంగఱ, దండకడియములు, ముఱుగులుఁ జూచి నవ్వుకొనువారు. నాకు వారిపట్టెలు, పంతపుగాజులు చూచి యెవ్వారి నగలు వారికి దేశాచారప్రకారము, కులధర్మానుసారము సొంపుగా నుండునని తలఁచుదానను. మీదేశములో మీవేషము; మాదేశమునకు వచ్చితివి; మావేషము వేయరాదా యనువారు. ఎవ్వరియాచారము వారిది; క్రొత్తయాచారము లేల యనుదానను. మీరిద్దఱేకదా; జీతమంతయుఁ దినివైచెదరా; నీకు సరదా లేదు. నీ మగని కంతకంటె, అని, నీకీవస్తువులపైఁ గోరికయున్న నీ మగఁడు నీకెక్కడనుండియో సొమ్ము పుట్టించి నగలు చేయింపఁడా? నాల్గువస్తువులు చేయించికొని తగిలించుకొంటివా యవి నిన్ను నీళ్లడుగునా, మేఁత యడుగునా– పడియుండును. వచ్చినదల్లఁ దినుచుండిన మీ కార్జన మెప్పుడు? వస్తువులనిన బరువుగాఁ జూచుచున్నారు మీరు. అది యొక్కపు డక్కఱ కెంత సాయపడునో యెఱుఁగరు–అని బుద్ధి చెప్పువారు. అమ్మా! మీరున్నవారు; నేఁడు గాకున్న రేపు మీకు సొమ్ము వచ్చును. ఆధైర్యముపై మీవారు మీకు నగలు చేయింతురు. మా కెక్కడనుండి వచ్చును? ఏధైర్యముపై నప్పుచేసి నగలు చేయించుకొందును? ఎఱిఁగియుండి నేను మావారి నెట్లు నిర్బంధపెట్టఁగలను. అట్లయిన, దినదినము వారు నన్నుఁ గాంచి యొకవిధమైన యసూయఁ గనఁబఱుతురు. నన్నుఁ జూడఁగనే క్రమక్రమముగ నాపై వారికి మునుపటివలెఁ బ్రేమ కనఁబఱుచుట తగ్గించుకొందు రేమో. నన్నుఁ జూడఁగనే యిది నగలకై ప్రాణము తీయుచున్నదని సంసారముపై విరాగము పుట్టునేమో. ఒక్క నగలేనా మనవలనఁ బతులవలన రావలసినవి? ఒక్కనగల నడిగి యెన్నో మేలువిషయములు పోఁగొట్టుకొందునేమో యను భయము. ముందు ముందేమో గాని యిపుడు లాభము లేదని సమాధానము చెప్పుచుండుదానను.

గంగాబాయియను నొక్క ముసలియవ్వ నామాటలు విని–తల్లీ! నిజమే చెప్పితివి. కొందఱు పసుపుఁదనపుమాట లాడుచున్నారు. వీరివీరి స్వాతిశయము, వీరివీరి వాల్లభ్యముం గని మోసపోవలదు. పతికంటె నగ వేఱొక్కటి యున్నదా? అతఁడు చూపించు దినదినాభివృద్ధియగు ప్రేమ

కంటె నైశ్వర్యము మఱువను నేనొక్కటియున్నదా. లేని వారిని దెప్పని బాధించుట కొంతఱకు వారికొల్ల దండ్రులు నేర్పిపెట్టినరు. ఒక దౌర్భాగ్యురాలు నీమగఁ డేమియు నగలు చేయింపఁడు; పుట్టినదానవు పుట్టినట్లున్నదానవు; ఎవ్వరు చూచినారు; నీవు ముందో యాతఁడు ముందో! నగలున్న నీ కెప్పటికైనఁ బనికివచ్చునని మాఁటునను బోధించినది. అది మగని వేధించినది. అప్పుచేసి నగలు చేయించినాఁడు. శ్రీహరీ యన్నాఁడు. అప్పులవాండ్రు పీడించినారు. నగ లున్నందువ ఫలము తెగనమ్మి, యప్పుతీర్చి నెత్తిన చేతులు వేసికొన్నది. పిడికెడు మెతుకులు పెట్టువారిప్పుడు లేరు. అల్లాడుచున్నది. తొలక నుపదేశించిన తల్లి, తండ్రి మరణించిరి. అన్నవదినె యున్నారు. దరిఁ జేరనీయరు. అందఱు నిట్లె యగుదురా యనవలదు. దినములు గడచిపోనిమ్మా. సతీపతులు పరస్పరానురాగముతో నుండుటయే నగలు చేయించికొనుట. ఒక్క నిర్భాగ్యురా లేమి చేసినదా- పతిమంచివాఁడు; చదువుకొన్నాఁడు. పాపము దానికిని దుర్బుద్ధులు లేవు, గాని నగలవెఱ్ఱి పట్టుకొన్నది. భోజనము చేయుచున్నపు డేదో సంగతి తలంపునకువచ్చును. అతఁడు తనస్నేహితునియిల్లు, పిల్లలు, భార్య యని ప్రసంగము తెచ్చును. అంతలో నా వెఱ్ఱిది మొగము వాలవైచికొని, వారి కేమి, ఆమె మగఁడు గడసరి, కావలసినన్ని నగలు చేయించినాఁడు - అని దింపును. దానితోఁ పెద్దప్రసంగములోనికి దింపి, నీలకంఠాయలోనికి వచ్చును. ఎన్ని చెప్పినను కష్టసుఖములు నీవు కనిపెట్టవు, నగలు నీనెత్తిని గొట్టుకొందువా యని యన్నము దిగవిడిచి యాతఁడు లేచిపోవుచుండెను. అయ్యో మీ కిష్టమని మంచివంకాయబజ్జి చేసినదానను- అని వెనుకఁ బడి యడుగునది. నాకేమో నేఁ డాఁకలి లేదు. నాకు భోజనము వలదని - నా కడుపులో నేదో యొకలాగున్నదని చెప్పునాఁడు. నానగల ప్రసంగముచేతనే కావచ్చును? కాదు కాదు- కాకేమి; నేను నగలమాట యెత్తినానని యే లేచిపోయినారు. అబ్బె కాదు! నాపాగఁ జూచినట్లే? చీచీ, లేదు. మీకడుపులో నాఁకలిగానే యున్నది. మీరు కోపగించి లేచిపోయినారు. రండు, మఱియొక విస్తరి వేసి వడ్డించెదను. బజ్జితో రెండుముద్దలు తిని లేచిపోండు. నా కక్కఱలేదు. ఉత్తరాపోశనము పట్టి మరలఁ దిందువా? నన్నుఁ జంపుకొన్నట్లే- నగలప్రసంగము గాదు? మీ కాఁకలి తీఱలేదు. నే నెఱుఁగుదును. నాకు వలదు. నాకుఁ బనియున్నది పోవలయు నని పుస్తకము చేతఁ బట్టుకొని పోవువాఁడు. నామాట వినరు? రెండుముద్దలు తినిపోరా! వలదు, రాత్రికి దాఁచిపెట్టుము. రాత్రికిఁ గూడఁ గావలసినంత యున్నది. విస్తరి వేయనా? వలదువలదు. అయ్యో నాకర్మమా, అన్నము దగ్గఱ నగల ప్రసంగము తెచ్చి తిండి తినకుండఁ జేసితినమ్మా! మీరు దినకున్న నేనును దినను. అని యేడ్చుచు మాఁతలు పెట్టి రాత్రి దాఁకఁ బస్తుపడియుండునది. పాప మది తిండితినలేదని కొంతలెంగ చల్లారి పెందలకడ నింటికి వచ్చి యన్నము తినువాఁడు. ఇంకొక పతివ్రతాతిలకము- నీవేమి కష్టపడియెదవో నాకుఁ దెలియదు; నెల కొక్కకాసు తూముపెట్టించి మెడలోఁ గట్టకపోయితివా, నీవు నాయింట విస్తరి లేదు, నీకుఁ జెలువుగట్టుమీఁద నే రాత్రి పడుక- అని నిష్కర్షగాఁ జెప్పునది. ఎక్కడనో ముష్టియెత్తి డబ్బు గడించి తెచ్చుచు, నెవ్వరింటనో సమారాధనలో భోజనము చేసితినని యింట భోజనము మాని, కృశించి చచ్చినాఁడు దానిమగఁడు. ఒక్కనాఁటి రాత్రి యెవ్వరో మసిబొగ్గుతో గోడమీఁద నీయింటియిల్లాలు మగనిచేత ముష్టియెత్తించి కాసులపేరు చేయించికొన్నదని వ్రాసినారు. దారిని బోవువా రెల్లఁ జదివి నవ్వుకొనువారు. కాఁబట్టి యేదో ముక్కులో ముల్లున్నది; తాళియున్నది; నల్లపూసలున్నవి; నీకుండవలసినవి యున్నవి; అంతనిమ్మాని కట్టులు చాఁపకు మని- చెప్పినవారి మాటలన్నియుఁ బాటింపకుమని- నీమగఁడు బుద్ధిశాలి, నీవు తెలివిగలదానవు. నేను మీయిద్దఱను మీ రిక్కడకు వచ్చినప్పటినుండి కనిపెట్టి చూచుచునే యున్నాను. ఏమో నీకుఁ బెట్టుకొను మంచి కాలము వచ్చిన నగలు తమంతటఁ దామే వచ్చును. మగఁడే చేయించునో, నీవే చేయించికొందువో! దైవమే యిచ్చునో! మీ రొక్కరిజోలివారు కారు. ఇట్టి మీలో మీరు నగలకై యంతఃకలహములు పెట్టుకొని వైమనస్యమంగీకరించుకొనకుఁడు. అపుడు మీ కీదేశములో దిక్కెవ్వరు? నీ కాతఁడు, నాతనికి నీవును నాధారముగాని నగలు మీ కెవ్వరికి నాధారము కావు. మన మెట్లు పెరుగుచుందుమో మనలోని యనురాగము నట్లే పెరుఁగుచుండవలయును.

అప్పుడే నిక్కమైన దాంపత్యము. ఎట్లు గడచునోయని మగఁడు తిండికై యేడ్చుచుండఁగా, నాకు నగలో నగలో యని బాధించు నిల్లాలింటిలో మగనికి దయ్యమో భూతమో కాని పెండ్లము కాదు. నీలోఁతు నీకుఁ దెలియును గాని పైనుండిచెప్ప వీరికిఁ దెలియునా! పెండ్లి, యాలుమగలు-అనునది యొకవిధమైనది దానిని విరివిపఱిచి చెప్పుట కష్టము. మాపిల్లకుఁ బెండ్లి పెండ్లి యని పాటలు పాడుచున్నపుడే పిల్లకొకవిధమైన యనురాగ ముత్పత్తియగును; గాని యది యెవ్వరిమీఁదికిఁ బోక - అర్థము తెలిసికొనఁ దెలియకుండ-మగఁడు వచ్చును; పెండ్లియగును; పల్లకి యెక్కుదురు; చీరలు సారెలు పెట్టెదరు- ఇట్లనియుఁ, దర్వాత రానురాను మగఁడని, సంసారమని, యుద్యోగమని, ధనమని-తర్వాత బిడ్డలని-యిట్లే యిరువురలోఁ జిన్నప్పటినుండి వృద్ధియగును. నాబిడ్డా! ఒక్కటే మాట! దాంపత్యము, వివాహము ననునది చిత్రమైనది. ఏవో యంతలు బొంతలు చుట్టఱిక మున్నపుడు రక్తస్పర్శచే నాలుమగ లొకరినొకరు పోలియుందురు. కాశిలోని పిల్లవానికి రామేశ్వరములోని పడుచును బంధుజాలము ప్రసంగములతోపాటుగా నిరువురకు ననురాగము గల్పించి వివాహము చేయుదురనుకొ. కాఁపురమునకు వచ్చినదిమొదలు క్రమక్రమముగా నొకరొకరి హృదయములందునవైనే ముఖములందును సామ్యము పొడకట్టును. క్రొత్తవారైనను స్త్రీపురుషు లొక్కచోటఁ బదిమంది నిల్చినచోఁడల, బుద్ధిమంతు 'లీమె వీనిభార్య; యీతఁడీమె పెనిమిటి'యని నూఱుమందిలోఁ దొంబదిమందిని గుఱుతుపట్టఁగలరు. నేను జెప్పితిని గనుక నీవును ఇఁక మీఁద గుర్తుపట్టఁగలవు. మగనిముఖము, మగువముఖము నేదో కొంచెము సారూప్యమును బొందియుండును. అట్టి సమానరూపము గలిగినతావునఁ గలదియే దాంపత్యము. మీయిద్దఱు నెంతదగ్గఱివారో దూరపువారో నే నెఱుఁగను గాని, యత్యల్పకాలములోనే నీకన్నులు నీమగని కన్నులను బుడికిపుచ్చుకొన్నవి. చెప్పినమాటలు విని చెదరుకొనకుము. పెండ్లి కాని, యిదియొక్కటి కాదు. ఈయనురాగము వచ్చినఱకు వృద్ధియగుచునే యుండును గాని అంకురించియుండువలె వయసు మరలినకొలఁదినుండి క్షీణింపదు. నీవు బాలవు: నిన్నజ్ఞాన మింకను విడువలేదు. విదేశము వచ్చి స్వతంత్రముగా జీవించుచున్నను మీరిద్దఱది బాల్యావస్థయే. ఏది విన్నను గ్రహించుస్వభావమే కాని విమర్శించు జ్ఞానము పుట్టలేదు. నీయొద్ద నేమి-వేయి ప్రసంగములు చేయరాదు. నామాటలను గూడ నీవన్నియుఁ బాటింపవలదు. నీకు, నీమగనికిఁ గావలసిన వానిని మాత్రము స్వీకరింపుము. అని మేమిద్దఱము గలసికొనినపు డెల్ల నాగంగాబాయిగారు చెప్పుచుండును. పాపమామె నాతో, మీరు చిన్నవారు; మీకుఁ దెలియని విషయము లెన్నియో కలవని-సంసారమునందు మీకింకను అనుభవము చాలదు- అని మాయమ్మ చెప్పకుండ విడిచినవి కొన్ని సంగతులు చెప్పుచుండునది. వారియిల్లు, మాయిల్లు కొంచెము దగ్గఱ. గంగాబాయిగారి యిల్లు మాయింటికిఁ గొంచెము దగ్గఱ. ఒక్కనాడు నాకుఁ దలనొప్పి వచ్చినది. సలపరము దగిలినది. ప్రొయ్యియొద్దఁ గూర్చుండుటచే వేఁడిగా నున్నదనుకొంటిని. అవ్వా నాయొడలేమి నిత్యమువలె నుండక యొక్కవిధముగా నున్నదంటిని. చేయి చూచినది. ఉష్ణముగా నున్నది, నే నొకమాత్ర వేసెద నన్నది. నాయొద్ద నేనుగారి సువర్ణవటి యున్నదంటిని అయ్యో నీ కది వలదు. ఈరాత్రి నీ వన్నము తినకుము. మా యింటనే పండుకొనుము. కొంచెము నిద్రపట్టుచున్నపుడు నీకౌషధము వేసెదనని తనప్రక్కలోఁ బండుకొనఁబెట్టుకొన్నది. ఆదినములలో వారలు సాయంకాలము నందేడుగంటలు మొదలు పదునొకండు గంటలవఱకు-పదునొకండు గంటల మీఁదఁగాని మావారు రాత్రిభోజనమునకు వచ్చువారు కారు నేను స్టేషనుకుఁ గబురుపంపెద నంటిని. ఎందుకు పనిలోనున్నవాఁడు తొందరపడునని సర్ది చెప్పినది. అతఁడే వచ్చినపుడు రానిమ్ము నీవు పండుకొమ్మన్నది. పండుకొంటిని. ధావళీవంటిది కప్పినది; నిద్రపట్టినది. 12 గంటలవఱకు నాకు మెలఁకువ రాలేదు. స్టేషనునుండి యింటికి వచ్చినారఁట. అప్పుడు మా యవ్వగారే లేచి వెళ్లి-దాదా! పిల్లకుఁ గొంచెము పులకరముగానున్నది. ఇక్కడఁ బండుకొన్నదిగాని లేపవలదు. నీ వన్నము తిని పండుకొమ్ము. నే నొకమాత్ర వేసితిని. తెల్లవాఱునప్పటికిఁ దేలికగా నుండునని చెప్పినదఁట.పాపమాయనయొడలు వణఁకి యేలయేల, జ్వరమెందుకు వచ్చినదో యని యడిగెనఁట.

ఏదో శరీరమైనతర్వాత జబ్బుచేయదా. తడిబట్టలు, స్నానము, ప్రొయ్యిగడ్డఁ గూర్చుండుట — అదియే పోవును: బెంగబెట్టుకొనకుము. అని బుజ్జగించి భోజనము చేయనిచ్చి నీకుఁ దోఁపకున్న విశ్వేశునిప్రక్కను మడఁతమంచముపై నిక్కడనే పండుకొనుము అని చెప్పినదఁట. నాకు భయము లేదు. మాయింటనే పండుకొందును గాని పాలేమైనఁ ద్రాగనేమో నాయొద్ద జ్వరమాత్ర లున్నవి యన్నారఁట. నీవొకమాత్ర, నే నొకమాత్రయు వేయవచ్చునా, పాలు పైత్యము పైత్యోద్రేకముచేతనే వేఁడి కలుగును. ఈరాత్రి వెచ్చగాఁ బండుకొననిమ్ము. నీవు నిద్రింపు మన్నదఁట. కొంచెము నేరుమెరుకులు దిను నేమో యన్నారఁట. నేరు శైత్యముగాదా! నీ కేమియు బెంగ వలదు. తెల్లవారినఁ భాగ్యము నీయింటి కప్పగించెదను. నేను దీనిప్రక్కలోనే పండుకొందును. మెలఁకువ వచ్చి మాయింటికి వెళ్లెదననిన నేను లాంతరు వెలిగించి కొని తీసికొనివచ్చి దిగవిడిచెదను పొమ్మన్నదఁట. అర్ధరాత్రము, చీఁకటి; వంటరిగా రావలదు. ప్రొద్దుననే రావచ్చును బండుకొననిమ్మని చెప్పి యామెహోరాజా బెంగతో బండుకొన్నారఁట. ఏమిమాత్ర వేసినదో యెఱుఁగను. ఎప్పుడు వేసినదో తెలిసికొనలేదు. తెల్లవారి లేచితిని. నా కొడలు చెలికగానున్నది. లేచి కాకీ మావారు వచ్చినారా? భోజనము చేసి పండుకొన్నారా? నే నిక్కడ నుంటినని యేమైనఁ గోపగించినారా? అని బెదరుచు నడిగితిని. ఏమియు ననలేదు; నీకు భయము లేదు. నేఁడు నీవు స్నానము చేయవలదు. పథ్యముగా నుండుము. ఈరాత్రికూడ మాత్రయిచ్చెదను; మాయింటికి రమ్మన్నది. ఆమె చెప్పినట్లు చేసితిని. హాయిగా నుంటిని. మేమెంత యదృష్టవంతులమో మమ్ము చూచినవారెల్లరుఁ బ్రాణముపెట్టి తమబిడ్డలవలెఁ గాంచుచుందురు. ఎంతటివారలును లేకున్నఁ బ్రపంచము నిల్చునా!

సుఖముగా నున్నన్నినాళ్లు కన్నుఁగానక తిరుగుచుండుటయే కాని, కొంచెము కాలునొప్పి యెత్తినపుడే యెంతో జాగ్రత్తగా నుండవలయును. చిన్నతనముచేతఁ దెలిసికొనలేక అనుభవముచేతఁ దర్వాతఁ దెలిసికొందుము. ఇందుకనియే పెద్దతల లేకున్న నెద్దుతల పెట్టుకొమ్మన్నారు పెద్దలు.

పదుమూఁడవ యంకురము

అది యేమో కాని నా కప్పు డప్పుడు తలనొప్పి, కొంచెము మన్ను, జలుబు, మొదలైనవి తటస్థించుచుండెను. కాని, యవి యొకటి రెండు దినములలోనే తగ్గుచు వచ్చెను. పాపము నాకు బద్ధకముగా నున్నపుడును వారే మడిగట్టుకొనవలసి వచ్చుచుండెను. అయ్యో, నేనేమి పాపము చేసితినో నేనెదుటనుండియే మిమ్ము శ్రమపెట్టుచున్నదాన నని విచారించుదానను. దీనికేమిగాని నీకు గడియగడియకు నిట్లు వచ్చుటకుఁ గారణమేమి: నూతినీళ్లు పడలేదా; చెఱువునీళ్లు తెచ్చుకొందమా? నిన్న నీ వేమిచేసితివి? రాత్రివేళ చన్నీళ్ల స్నానముచేసితివా, తడిగుడ్డ కట్టుకొంటివా యని యడిగిరి. నే నేమియు నెఱుఁగను. ఎన్నఁడును మీరనినట్లు నూతినీళ్లు మిచేసినవో, చెఱువునీళ్లు మిచేసినవో భేదము కనిపెట్టనే లేదు. మును పెవి త్రాగినను జబ్బుచేయలేదే. తడిగుడ్డలు రాత్రులు కట్టుకొనను— పట్టుపంచె యున్నది; మడిబట్ట లున్నవి. నేనేమియుఁ జేయలేదు; మీరు తినినవే నేనును దింటిని. అని నేను జెప్పితిని.

ఏమైనఁ దెప్పించుకొని తింటివా?

ఏమి తెప్పించుకొని తింటిని, నన్నెపుడైనఁ జూచినారా?

ఏమో జిహ్వాచాపల్యమునఁ దినినఁ దప్పేమి.

నాకెవ్వరు తెచ్చిపెట్టెదరు, నేనొకరిచేతఁ దేబడిన దెన్నఁడైనఁ దింటినా.

తినినఁ దప్పేమి, కలకండ పంచదార మొదలైనవి తెప్పించుకొనవచ్చునుగదా.

మిమ్ముఁగాదని యెన్నఁడైన నే నొంటిగా నోటఁ బడవైచుకొన్నది చూచినారా.

అన్నియు నాకుఁ బెట్టకుండఁ దినఁగూడదని శాస్త్రమా.

ఇది యేనమ్మ నేఁడీలాటిమాట యనుచున్నారు. లేచి యెవ్వరి మొగము చూచినానోగాని.

ఇదియు నొకతప్పేనా, యేమైనఁ గొని తింటివి యని యడుగనేకూడదా.

అయ్యో కర్మమా, ఇది యెక్కడిపాపము? నన్నీనాఁ డిట్లు నిర్బంధించుచున్నారు; ఇన్నినాళ్లయి వచ్చినను నామనస్సు మీరు కనిపెట్టలేదు గాఁబోలును.

నేనేమి తప్పంటిని, పోనీ మాటలాడను.

అమ్మా! ఇదియొకకష్టమా; మీరు మాటలాడననిన—పట్టెదే నవ్వుచు ననుచున్నాను. నాతో మాటలాడరు?

ఎందుకు నీకు మాటాడినఁ గోపము వచ్చును. నేను మాటలాడినఁ బ్రయోజన మేమి?

(కన్నులు నలుపుకొనుచు) నేను, నేనే, నేను, మీ మాటకుఁ గోపపడితినా?

కోపమో తాపమో! ఏమిచేసితివనినఁ జెప్పవు; ఏమైనఁ గొనితింటివా యనినఁ జెప్పవు.

అయ్యో రామా! నేనేమియు నెఱుఁగనుగదా. మీతో నబద్ధమాడుదునా.

ఏల నీకీజబ్బులు మాటిమాటికి రావలయునో తెలిసికొనుట కడుగుచున్నాను.

ఏల వచ్చినవో, నేనుండి మీచేతఁ బనులు చేయించుకొనుటకు వచ్చినవి.

ఆరోగ్యము తప్పినపుడుకూడ నీవే వండవలయుఁగాని నేను వండగూడదా? ఇది నీతప్పా! అట్లైన నీకు మఱియొక్కింత యనారోగ్యమగును.

లేకపోయిన నాపాపము నన్నిట్లెందుకు వ్యాధిరూపముగా బాధించుచున్నది.

ఒకప్పుడు పదార్థములలో దోషముండును. ఆ వేళలలో నేదైనఁ దినిన దోషము కలుగును. వ్యాధి వచ్చుట కనేకమార్గములు. మనుష్యులకు రాక మ్రాకులకు వచ్చునా.

నాగ్రహచారము కాకపోయిన, నేనేదో తెప్పించుకొని తింటినని పట్టించినారేమమ్మా!

తెప్పించుకొని తినుట తప్పా, నేననుట తప్పా.

నేనొకరిచేతఁ దెప్పించుకొని తినుట యెన్నఁడైన నెఱుఁగుదునా.

ఎన్నఁడు నెఱుఁగకున్న నీనాఁ డెఱిఁగియుండరాదా.

నేను మాటలాడలేనమ్మా, ఏ మనినను దప్పే వచ్చును.

సరి యిపుడు నీవు మాటలాడ ననుచున్నావు, వంతునకు వంతుతీఱినదా.

అయ్యో, నే నందుకన లేదు, క్షమింపుఁడు. నేనేమి, మీతో మాటలాడకుండుటేమి.

కారణము తెలియకయేకదా; ఏమి తినిన వచ్చియున్నదో యని సందేహము.

నేనేమి తిందును; తిండివలన వచ్చినది కాదు.

మీవాండ్రను జూడవలెనని బెంగపెట్టుకొన్నావా యేమి మఱి.

లేదులేదు; నా కాబెంగ వచ్చినక్రొత్తలోనే లేదు. నీకేమైనఁ గోరికయుండి నన్నడుగలేకున్నావా. నాకోరిక మీయొద్దఁ జెప్పలేకపోవుటకు నాకేమి సంశయము? ఇంకెవ్వరియొద్దఁ జెప్పుదును? నాకేమియుఁ గోరిక లేదు.

బెంగ లేదు; కోరిక లేదు; కొని తెప్పించుకొని తినలేదు.

ఏమిపాపమమ్మా! కొని తెప్పించుకొనుట—అనాచారము—నేను చేసికొనలేనా? కొనవలెనా! నాకేమి చేతఁగాదా?

పోనీ, చేసికొని తినలేకపోయినావా మఱి?

ఏమిటి, ఏమికోరిక, ఏమిచేసికొని తిందును.

కాదు, ఏదైనఁ గోరికయున్నఁ జేసికొని తినవచ్చును.

నా కొక్కకోరిక లేదు. నాయొద్ద నొక్క దాఁపఱికము లేదు.

ఇప్పుడే కాదు, ఎప్పుడైనను సందేహింపక యేమి కావలసినను నన్నడుగవలయును. నీచేతిలో నిపు డేమి యున్నది.

(తెల్లపోయి) నాచేత దమ్మిడికూడ లేదు. పదిదినములక్రిందటివఱకు వెచ్చము మీరే పెట్టుచున్నారు.

ఈమాటలతో మావారికిఁ గొంచెము మొగము చిన్నఁబోయినది. డబ్బులేకపోవుట, దీనిచేతిలో నెందుకైన నొక్కడబ్బు పెట్టుటకైనఁ జాలని యీయుద్యోగ మేమిటికి అని తోఁచినది. ఛీ యీజన్మము కష్టజాజ

నము. నేను గడుపు నిండఁ దిని తల్లిదండ్రులనుబస్తు పెట్టినా, వారి కిచ్చి నే నుపోష్యముందునా? ఏమి యుద్యోగము! అందఱు మావాండ్రుద్యోగముచేసియే జీవించుచున్నారా యని విసికికొనిరి. ఏల మీకంతవిసుగు. మన కేమికష్టము వచ్చినది. మన ముపోష్య ముండుటలేదు. మనవారు నుండుటలేదు. హాయిగాఁ దినుచుండియు, నీనిరసన మెందుకుఁ బుట్టినది. అని నే నంటిని. "మీనాయన యొక వెఱ్ఱివాఁడు. మానాయన యొక పిచ్చివాఁడు." అనిరి. "అదియేమి నేఁడు పెద్దవారిని నిందించుచున్నారు." అని నే నంటిని. ఏమి పెద్దవారు. ఆలోచనలేనివారు పెద్దలా!

నేను—వా రేమియనాలోచితకృత్యము గావించిరి? మా నాయనతప్పేమి?

వారు—నిర్భాగ్యునకు నాకు నిన్నిచ్చుట గొప్పతప్పు.

నేను—అయ్యో మీ కేమిలోప మున్నది?

వారు—కనఁబడుచునే యున్నది లోపము. నాకెక్కుడఁ బెండ్లికాదో, బ్రహ్మచారినిగా నున్నఁ బ్రపంచమున కెక్కుడ వెలితి వచ్చునో యని మానాయనభయపడి మీనాయన మాటల కొప్పుకొన్నాఁడు. వెఱ్ఱియుఁ గాక, పిచ్చియుఁగాక యిదియేమిటి?

నేను—మీనాయనగారి తెప్పు యిది. వారిద్దఱును సత్య కాలపువారు. వారు తలఁచినదెల్ల మంచిగానే యైనది. మన కేమిలోప మున్నది. నే నేమి చక్కనిదానను గానా?

వారు—నీవు చక్కనిదాన వగుదువో కావో, నేను గాను.

నేను—మీ కేమి తక్కువ, మన్మథునివలె నున్నారు.

వారు—ఆ మన్మథుఁడు లక్ష్మీపుత్రుఁడు, నీమన్మథుఁడు కుచేలపుత్రుఁడు.

నేను—మనము పేదవారమా? మన పెద్దవారికంటె మన మే ధనవంతులము. మనము బీదలము కాము.

వారు—బీదలమో కామో నీవెఱుఁగవా-ఎఱుఁగనిదానివలె మాటలాడెదవు.

నేను—నిజముగా నే నాబీదతన మేదో యెఱుఁగనిదాననే. మనకు ధనాభావమా?

వారు—నీచేతిలో నెప్పుడు నుపయోగించున ట్టొక్క రూపాయి, యర్థ పెట్టలేనివాఁడను- ధనాభావము గదా! గ్రుడ్డివానికిఁ గూడఁ గనఁబడుచున్నది.

నేను—అయ్యో నాకెందుకు? మీయొద్దనే పెట్టుకొనుఁడు. దమ్మిడికూడ నాచేతి కీయవలదు.

వారు—నాయొద్దనే పెట్టుకొనువాఁడనైన నీ కీయలేక పోయితినని విచారింతునా.

నేను—నాకేల మీ రీయవలయును. మీయొద్దనున్నవి నావి కావా? మీకు నాకని భేదభావ మేల మీకుఁ గలిగినదో! అట్లయిన నే నొక్కనిమిషము బ్రదుకఁజాలను. మీ దే నాది, నాదేమీది యని యున్న దానిని మీరు వేఱుచేయుచున్నారు.

వారు—దైవమే వేఱుచేసెను. నీవు వేఱే, నేను వేఱే యెప్పటికిని.

నేను—నే నెప్పుడు మీదాననో యపుడు మీరు నేను నొక్కటియే-వేఱెట్లు?

వారు—నీవు వేఱని భగవంతుఁడే చేసినాఁడు.

నేను—లేదు, చేయలేదు; శరీరములు రెండుచేసినను మనస్సులు వేఱుచేయలేదు.

వారు—ఆఁడుదానిమనస్సు మగవానిమనస్సు నెన్నఁడుఁ గలియవు.

నేను—నే నంతటివంటి యాఁడుదాననేనా? నామనస్సు మీమనస్సులోనే కలసినది.

వారు—కలసినను రంగు వేఱుగానే యుండును. గడనగల మగనిఁ జూచిన - సుమతిశతకము చెప్పినవాఁడు వెఱ్ఱివాఁడా.

నేను—ఈనాఁ డేమయ్యా మీ కీలాటిబుద్ధులు పుట్టుచున్నవి. నే నెన్నఁడయిన మీరు గడించుటలేదు, నాకు డబ్బిచ్చుటలేదని యంటినా?

వారు—నీ వనకున్నను భేరీభాంకారమువలె నాహృదయములో వినఁబడుచున్నది.

నేను—నే ననలేదు, భూమితోడు-డబ్బు నామీఁదఁ బడవైచి కాల్చికొందునా.

వారు—నీవు మోటుమాటలకు దిగినదానవు.

నేను—మీమాటలకుఁ దగినట్లు చెప్పుచున్నదానను.

వారు—సరి! కుదిరినది. నీకేమి యింటఁ బనిలేదా. మాటకు మాట లాడుచున్నదానవు.

నేను—పని లేకేమిగాని, నేను మీతో వాదులాడుచున్నట్లర్థముచేసినారా. నే నెన్నఁడును డబ్బు లేదని, డబ్బు తెమ్మని మిమ్ము బాధించితినా! మిమ్ము బాధించుట కా మీయింటికి వచ్చినది.

వారు—ఎంతవైరాగ్యముగల స్త్రీకైనను బరువు మగనిఁ జూచిన—

నేను—అయ్యో; అయ్యో! మీరు బరువువారా! మీకు ధనము లేదా. ఈవచ్చునది మనకుఁ జాలదా. దైవము కటాక్షించి ముం దింతకంటె నెక్కుడుఘన మీయఁ గూడదా! యెవ్వరు చూచినారు. మీరు కుబేరులైనపుడుగూడ మీయొద్ద నింతకంటె నెక్కుడువేషము వేయను. మీరు సింహాసన మెక్కినను మీ పాదములు నేనే కడిగెదనుగాని రెండవవారిని ముట్టనీయను. మీరు మేలుగా నీ కంటికెదుటఁ గనఁబడుటయే యేడువారముల నగలు—కట్టిపెట్టుఁడు, మన ప్రసంగము చాలదూరము పోయినది. చుట్టుతిరిగి మెట్టకు వచ్చినది. ఎల్లకాలము నేదియుఁ బుట్టినది పుట్టినట్లే యుండదు వృద్ధి యగుచుండునుగాని. మన కేమియైశ్వర్యము రానున్నదో యెవ్వరుచూచినారు. మనలను మనము నిందించికొనరాదు. అని నేనేదో పని మీఁద నింటిలోనికిఁ బోయితిని. వారు గదిలోనికిఁ బోయి క్రొత్తచొక్కాకు బొత్తములు పెట్టుకొనుచున్నారు. ఎవ్వరో తలుపు తట్టినారు.

ఆ, ఎవ్వరో పిల్చుచున్నారు. మీరు గదిలో నున్నారా? నాచేతు లంట్లవి. అని నే నంటిని.

ఏమి: ఉన్నాఁడను. తలుపు తీసెదను. నీపని చూచుకొనుము. అని వారు వచ్చి యెవరది? యని కేకవైచిరి. పోస్టుపోస్టుఫూన్ డాక్ డాక్ అనిధ్వనివినవచ్చెను.

వెంటనే వారును, నేనును మాతల్లిదండ్రులు వ్రాసిన యుత్తరమైయుండునని తొందరగా వచ్చితిమి. తలుపు తెఱచినారు. నేను వరండాలో నిలువఁబడి సంతోషముతో ఇంతమొగముచేసికొని చూచుచుంటిని. రిజిష్టరీ యుత్తరము. ఇద్దఱకు గుండె గుభేలుమన్నది. ఏదీ యని పుచ్చుకొన్నారు. హిందూస్థానీ వ్రాఁత, ఆగరపారాపోస్టుమర్దనుగాఁడు వ్రాసినది. ఏమిటది! వీఁడు నాకు రిజిష్టరీ యుత్తరము కట్టినాఁడా? ఏమికారణము? అని బెదరిరి. చేవ్రాలు చేసి పుచ్చుకొన్నారు. తిరుగఁగొట్టుటకు గోషిగాఁడు విరోధి కాఁడు—ఏదో రండవయాకాశరామన్న యుత్తరమని భయము. బల్లమీఁదఁ బెట్టినారు. విప్పరు. చేతులు తటపటాయించుచున్నవి. నేను పుచ్చుకొన్నాముగదా విప్పండి యేమిచేయుదు మంటిని. పొద్దుటినుండి మనము లేచుచు నెవ్వరిమొగము చూచినామోగాని, వాదములు, తగవులు—ఉత్తరములు—అని వారు పల్కిరి. "నేను పార్వతీదేవిపటమునకు దండము పెట్టి లేచితిని. కాఁబట్టియే మనవాదములు, తగవులు చల్లఁబడిపోయినవి." అని నేను పలికితిని. ఈయుత్తరముతగవు తీరు పెట్లు? నేను లక్ష్మీనారాయణపటము చూచి లేచినాఁడను. మన పాలింటికి ఆకాశరామన్న యుత్తరములు పట్టుకొన్న వేమి గ్రహచారము అని వారు విసుగుకొనిరి.

"నేను కుట్లబొంత నగుటచేత మనలో మనకుఁ దగవులు వచ్చినవి. నారోగముతోనే మీప్రాణము విసుగుచుండఁగా నానిర్భాగ్యత్వమువలననే మఱియు మఱియు మీకిట్టి యలజడి కలుగుచున్నది. పుచ్చుకొన్నారు విప్పి చదువుఁడు."

"ఏమో యేమున్నదో: బంట్రోతు దూరము పోఁడు; త్రిప్పివైచెదను."

చేవ్రాలుచేసినారే, వాఁడు పుచ్చుకొనునా?

మఱియేమి చేయుదుము. ఉపాయమేమైన నున్నదేమో వాని నడిగి వచ్చెదను.

వాఁడేమి యుపాయము చెప్పును—చదివి యాబక తబక లున్నఁ జింపి పాఱవేయుఁడు.

చదివిన—మనస్సులో బాధ—బెంగ—చూడకుండఁగానే చింపివేయుదునా? (అని పట్టుకొన్నారు.)

వలదువలదు, చూడకుండఁ జింపవలదు— ఏమియున్నదో—

ఏమియుండును? మునుపటివలెనే యేవో చీవాట్లు, నిందలు—

మను పట్లు వ్రాసినవాఁడు మనయొద్దనే యున్నాఁడుగదా?

అతఁడు గాకున్న నితఁ డింకొకఁడు కావచ్చును.

ఎవ్వఁడైనను మంచిదే, విప్పిచదువుట యెందుకైనను మంచిదే, నాకుఁదోఁచిన దిది.

నీవు విప్పిచదివి, మంచి యున్న నాకుఁ జెప్పుము. తిట్లున్నఁ జించివేయుము.

మీకు వచ్చిన యుత్తరము మీరే చింపికొనుఁడు. ఏదుర్మార్గుఁడైన నన్ను నిందించినాఁడేమో.

ఏమియున్నను సరియే, నేనుమాత్రము విప్పువాఁడను గాను; నీవే విప్పుము.

నాకు మొట్టమొదటనే భయము. మీరే విప్పుకొనుఁడు.

అని యిరువురమును, ఆకాశరామన్న యుత్తరమేమి యగునని, శంకచేత నవ్వుకొన్నారము. ఏమియు లేక హాయిగానున్న మనమీఁద నీదుర్మార్గుల కింతపగ యేల? భగవంతుఁడు వారికన్నులలోని పాపలు మొదలైనవి మఱియొకవిధముగాఁ బెట్టినాఁడేమో. మనలను గాంచి యోర్వలేరేమి? మన మేమి ధనవంతులమని? నాపై యధికారులు నాయొద్ద నొక్కతప్పు కనిపెట్టలేదు. నే నేమియుఁ దప్పు చేయలేదు. తెలియని విషయములు కప్పిపెట్టలేదు. సంశయములు పైకి వ్రాసి కనుఁగొని మఱియుఁ జేయుచుందును. నాకుఁ దెలియనిది పోస్టరు కూలివాఁడు చెప్పినను దెలిసికొని యాప్రకారము నడచుచున్నాఁడను. ఒక్కప్రమాదము లేదు. నే నొక్కరికి హాని చేయలేదు. నా కొక్కఁడు విరోధి కనఁబడఁడు. నాపై దుష్టులకేల యసూయ? ఒకటియైయుండును. విదేశము వాఁడు మనదేశములోనుండి యింతమేలుగా నుండనేల యని యుండవచ్చును. కానిమ్ము, ఇప్పుడు వలదు. స్టేషనులోఁ బనిచూచికొని వచ్చి, భోజనము చేసి, సావకాశము గాఁ జదువుకొందము. దీనిని బల్లమీఁద నిట్లే యుండనిమ్ము. ఈలోఁగా నేమైన విశేషములు తెలియవచ్చిన రావచ్చును. అని వారు చింపుట మానిరి.

నాకిది యొకబెంగ. చూచి, చదివి, పాఱవైచిన యెడల బెంగ తీరును. దీనికై యింత యాలోచన యేల? విషయమేదో మన మెఱిఁగినదే. మనకుఁ జీవాట్లే యందుండును. ఎవ్వరిచేతను దిట్లు దినకుండ మంచివాఁడని పించుకొన్నవాఁ డెవ్వఁడు లేఁడు, చింపుఁడని నేను ప్రోత్సహించితిని.

ఉత్తరము చేతఁ బట్టికొని యొగాదిగఁ జూచినారు. ముద్రలు పరీక్షించినారు. చేయి వణఁకుచున్నది. కృష్ణా యని కన్నులు మూసికొని నవ్వుచుఁ జింపినారు. నా మొగమువంకఁ దిరిగి, నవ్వుచు, విప్పనా! చదువనా! యని మాటలు విప్పుచున్నారు. నాకాళ్లు దడదడ లాడినవి. ఏదో పని గల్పించుకొని వంటయింటిలోనికిఁ బోయి, పీటమీఁదఁ గూర్చుండి, గోడకుఁ జేరఁబడి, కన్నులు మూసికొన్నదానను. లోలోనఁ జదివికొని, బల్లమీఁద నుత్తరముఁ బడవైచి కుర్చీమీఁదఁ గన్నులు మూసికొని కూర్చుండిరి. ఒడలు చెమ్మటపట్టినది. ఏమిచేయుచున్నారో యని తొంగిచూచితిని. ఉత్తరము బల్లమీఁద గాలికిఁ గెరింతలు కొట్టుచున్నది. వీరొడలుమఱచి మాటలాడకుండఁ గన్నులు మూసికొని యుండిరి. నాప్రాణము లెక్కడికో పోయినవి. దగ్గఱవచ్చి, యేమియిట్లున్నారు. ఉత్తరములో నేమి యున్నది. మాటలాడ రేమి- యని మొగముమీఁద మొగముపెట్టి, గడ్డము పట్టుకొని, కాళ్లు వణకుచుండఁ, బదినిమిషములు నేనును అదేప్రకారము- పదినిమిషములు నిశ్శబ్దముగా నుంటిమి.